ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 31 జనవరి 2024



జేఈఈ మెయిన్స్‌కు 395 మంది హాజరు

ఎచ్చెర్ల, జనవరి 30: దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో రెండు కేంద్రాల్లో మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలకు 400 మంది అభ్యర్థులకుగానూ 395 మంది హాజరయ్యారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 200 మందికి 198 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో 200 మందికి 197 మంది హాజరయ్యారు. గురువారం వరకూ ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

అవగాహన లేకనే..!

● జిల్లాలో అధికమవుతున్న బాల్యవివాహాలు ● సమాచారం తెలిస్తే అడ్డుకుంటున్న అధికారులు

● మెళియాపుట్టి మండల కేంద్రంలోని భాగ్యనగర్‌కు చెందిన 16ఏళ్ల బాలికకు ఇటీవల పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేశారు. చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం అందడంతో వారు వచ్చి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు.

● మెళియాపుట్టి మండలం జలగలింగుపురానికి చెందిన 17ఏళ్ల బాలికకు కొన్నాళ్ల కిందట వివాహం చేయాలని తల్లిదండ్రులు ముహూర్తం నిశ్చయించారు. సమాచారం తెలుసుకున్న చైల్డ్‌లైన్ అధికారులు ఆ బాలిక ఇంటికి చేరుకున్నారు. బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరించి.. పెళ్లి జరగకుండా అడ్డుకున్నారు.





మెళియాపుట్టిలో అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ అధికారులు (ఫైల్)

(మెళియాపుట్టి)

ప్రపంచం సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లోనూ జిల్లాలో బాల్యవివాహాల సంస్కృతి తగ్గడం లేదు. అన్నిరంగాల్లో మహిళలు దూసుకుపోతున్న వైనాన్ని కళ్లారా చూస్తున్నా.. ఇంకా ఆడపిల్ల గుండెలపై భారమని భావించే తల్లిదండ్రులు ఉన్నారు. వీలైనంత తొందరగా ఆడపిల్లకు పెళ్లి చేసి.. బాధ్యత తీర్చుకోవాలనే ఉద్దేశంతో పెళ్లీడు రాకుండానే వివాహాలు చేసేస్తున్నారు. ఈ క్రమంలో బాల్యం.. మూడుముళ్ల బంధంలో చిక్కుకుంటోంది. బంగారం లాంటి బాల్యాన్ని ఆస్వాదించకుండానే సంసార సాగరాన్ని ఈదాల్సి వస్తోంది. అధికారులు చర్యలు చేపడుతున్నా.. స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా.. జిల్లా బాల్యవివాహాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అధికంగా గిరిజన గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వివాహమైన తర్వాత కొద్దినెలలకే అనారోగ్యం బారిన పడి కొంతమంది చిన్నారులు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఏడాది వ్యవధిలో జిల్లాలో 134 బాల్యవివాహాలను నిలుపుదల చేసినట్టు చైల్డ్‌లైన్ అధికారులు చెబుతున్నారు. అధికంగా గ్రామీణ ప్రాంతాల్లోనే బాల్యవివాహాలు జరుగుతున్నాయని, ఈ మేరకు సమాచారం అందితే.. వెళ్లి అవగాహన కల్పించి అడ్డుకుంటున్నామని పేర్కొంటున్నారు.

చట్టాలేం చెబుతున్నాయంటే..

బాల్య వివాహాల నిరోధానికి కఠిన చట్టాలున్నాయి. వీటిని అడ్డుకోవడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. 1929లోనే బాల్యవివాహాల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారు. దీనిలో శిక్షలు తక్కువగా ఉండడంతో కొన్ని మార్పులు చేసి.. 2006లో సంపూర్ణంగా అమలులోకి తీసుకొచ్చారు. 2007 నవంబరు నుంచి బాల్యవివాహాల నిరోధక చట్టం అమలు ప్రక్రియ ప్రారంభమైంది. 'సమాజంలో యువత జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వాలి. వివాహం చేసుకునేందుకు అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు తప్పనిసరి. ఈ నిబంధన అతిక్రమిస్తే రెండేళ్ల జైలు. రూ.లక్ష జరిమానా' విధించనున్నట్టు చట్టంలో స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత బాల్యవివాహాలు తగ్గాయి. కానీ, గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీల్లో ఈ చట్టంపై అవగాహన లేక ఇంకా బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. సినిమాలు, టీవీ ప్రభావంతో యువత ప్రేమవలలో చిక్కుకుంటున్నారు. దీంతో పెద్దలకు తెలియకుండా ఇంటినుంచి బయటకు వెళ్లిపోవడం.. వారిని తల్లిదండ్రులు వెదికి పట్టుకుని పెళ్లీడు రాకున్నా వివాహం చేస్తున్న సందర్భాలున్నాయి. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, దగ్గర సంబంధాలు తదితర కారణాలతో వివాహాలు చేస్తుండడం కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా.. బాల్యవివాహాలు పూర్తిస్థాయిలో కట్టడి కావడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే వెళ్లి.. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. బాల్యవివాహాలను అడ్డుకుంటున్నాం. బాల్యవివాహాలకు సహకరించిన వారిపైనా కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వండి.

-జగన్నాథం, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్, పాతపట్నం సర్కిల్



ఇసుక లారీలను అడ్డుకున్న పొన్నాంపేట గ్రామస్థులు

ఇటువైపు రావొద్దు

● ఇసుక లారీలను అడ్డుకున్న పొన్నాంపేట గ్రామస్థులు

ఆమదాలవలస, జనవరి 30: ఇసుక లారీలను తమ గ్రామం మీదుగా రాకపోకలు సాగించొద్దంటూ పొన్నాంపేట వాసులు వాహనాలను అడ్డుకున్నారు. ఆమదాలవలస మండలం చవ్వాకులపేటలో వంశధార నది వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టి భారీ లారీలపై విశాఖపట్నం తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ఇసుకలారీలను పొన్నాంపేట గ్రామస్థులు అడ్డుకుని నిలిపేశారు. టీడీపీ నాయకురాలు ఇప్పిలి రమణమ్మ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. తరచూ ఇసుక లారీలు బోల్తాపడడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోడ్డుపై నిరసన తెలిపారు. దీంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడకు చేరుకుని.. ఇసుక ర్యాంప్ వద్దకు గ్రామస్థులను తీసుకెళ్లారు. ర్యాంప్ సిబ్బందితో చర్చలు జరిపారు. ఇసుక లారీడ్రైవర్లు గుంతల రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలు నడపడంతో బోల్తాపడుతున్నాయని, ఇసుక తరలించే సమయంలో టార్పన్లు కూడా పెట్టడం లేదని గ్రామస్థులు ఎస్ఐ వెంకటేష్‌కు వివరించారు. తమ యాజమాన్యం దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తామని ర్యాంప్ నిర్వాహకులు తెలిపారు.

పూత.. పిందె లేదు

● జీడి పంటపై వర్షాభావ పరిస్థితుల దెబ్బ

● ఆందోళనలో రైతులు



మామిడిపల్లిలో పూతరాని జీడిచెట్టు

పలాస రూరల్, జనవరి 30: వర్షాభావ పరిస్థితులు జీడిపంటపై ప్రభావం చూపుతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు నుంచి సరైన వర్షాలు లేక ఈ ఏడాది జీడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్దాన ప్రాంత రైతులకు జీడి సాగు ప్రధాన జీవనాధారం. పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాల్లో రైతులు అధికంగా జీడి సాగు చేశారు. ఏటా డిసెంబరు నుంచి పూత వచ్చేది. జనవరిలో పిందెలు వచ్చేవి. కానీ, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులో ఇంతవరకూ పూత లేకపోవడం, పిందెలు కనిపించకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పది రోజులుగా మంచు విపరీతంగా కురుస్తుండడంతో ఉన్న కాస్త పూత కూడా మాడిపోతోందని వాపోతున్నారు. ప్రతికూల పరిస్థితులతో జీడిసాగు భారమవుతోందని, ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు కూడా జీడిసాగు సస్యరక్షణకు సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. ఈ ఏడాదైనా మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అచ్చెన్నాయుడు, టీడీపీ నేతలు, కార్యకర్తలు

మహాత్ముని సందేశాన్ని ఆచరించాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 30: 'సత్యం, అహింసా అనే ఆయుధాలతో ప్రపంచానికి కొత్తదారి చూపిన మహాత్ముడు.. గాంధీజీ. ఆయన మార్గంలో మనమంతా పయనించాలి. మహాత్ముడి సందేశాన్ని ఆచరించాల'ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, బాపూజీ కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగాది శేషు, లవకుమార్, కోళ్ల కామేష్, మెండ అప్పారావు పాల్గొన్నారు.

రాత్రంతా బురదగుంటలో..

● బహిర్భూమికి వెళ్లి చిక్కుకున్న వృద్ధురాలు

● పలువురి సాయంతో తప్పిన ప్రాణాపాయం

జి.సిగడాం, జనవరి 30: ఓ 75 ఏళ్ల వృద్ధురాలు సోమవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి బురద గుంటలో చిక్కుకుని రాత్రంతా అందులోనే ఉండిపోయిన ఘటన పొగిరి-మర్రివలస గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. విజయనగరం జిల్లా పొగిరి గ్రామానికి చెందిన కామమ్మ సోమవారం రాత్రి 9గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. గ్రామంలో తెలిసినవారి ఇంటి వద్ద నిద్రపోయి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే దట్టమైన పొగమంచు, కారుచీకటి వల్ల ఆమె దారి తప్పి జి.సిగడాం మండలం మర్రివలస సమీపంలోని ఓ గుంతలో దిగిపోయింది. బయటకు వచ్చేందుకు ప్రయత్నించి అందులోనే పడిపోయి రాత్రంతా ఉండిపోయింది. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఆమెను గుర్తించి కొంతమంది సాయంతో బయటకు తీసు గ్రామస్థులకు సమాచారం అందించారు. అనంతరం ఆమె దుస్తులు మార్పించి, చలిమంట వేసి సపర్యలు చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది.





బురదలో చిక్కుకున్న వృద్ధురాలు కామమ్మ, ఆమెను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్తున్న స్థానికులు



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బీటీఏ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

● బహుజన టీచర్స్ అసోసియేషన్

కలెక్టరేట్, జనవరి 30: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేకేటి రామారావు, పడాల ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. '11వ పీఆర్సీ, డీఏ ఏరియర్స్ రూ.7,382 కోట్లు, పెండింగ్‌లో ఉన్న రూ.వెయ్యి కోట్లు పీఎఫ్ లోన్లు వెంటనే చెల్లించాలి. రెండేళ్ల నుంచి పెండింగ్‌లో సరెండర్ లీవ్‌ల బకాయిలు రూ.4500 కోట్లు విడుదల చేయాలి. ప్రతీ నెల 1న జీతాలు చెల్లించాలి. 30శాతం ఐఆర్ ప్రకటించాలి. మునిసిపల్ ఉపాధ్యాయులకు జీవో నెంబరు-84ను రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాల'ని వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు తాతారావు, ట్రెజరర్ బి.దుర్యోధన, అదనపు కార్యదర్శి శ్యామ్‌కుమార్, నూకరాజు, వివిధ మండల ఉపాధ్యాయ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

అరసవల్లి: మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ఫిబ్రవరి 1న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్‌మోహన్, బి.సుభాష్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

నిరసన దీక్ష



శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాష్ట్రానికి హోదా ఇవ్వకుండా బీజేపీ మోసం

● ప్రత్యేకహోదా సాధన సమితి మండిపాటు

శ్రీకాకుళం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా బీజేపీ మోసగించిందని ప్రత్యేకహోదా సాధన సమితి మండిపడింది. మంగళవారం శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి యుగంధర్, సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నర్సునాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసిందని.. కేంద్ర సంస్థలు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చూపిందని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు చర్యలు తీసుకుందని, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైల్వేజోన్ కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో పార్టీలు కొట్లాడుకుని.. ఢిల్లీలో మాత్రం బీజేపీ వద్ద సాగిలపడిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం.. హోదా సాధన, విభజన హామీల విషయంలోనూ కనీస శ్రద్ధ చూపడం లేదని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రం చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాధన సమితి కార్యకర్తలు, వామపక్షాల కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద గొండు శంకర్, తదితరుల నిరసన

పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలి

● సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్

అరసవల్లి, జనవరి 30: రాష్ట్రంలో నిర్వీర్యమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలని ఉమ్మడి సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళంలోని గాంధీపార్కు వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులను కాలరాసింది. సర్పంచ్‌ల విధులు, నిధులను స్వాహా చేసి.. వ్యవస్థను నిర్వీర్యం చేసింది. 14, 15 ఆర్థిక సంఘం ఇచ్చిన సుమారు 18,600 కోట్ల గ్రామ పంచాయితీ నిధులను దోచుకుంది. గ్రామాలు అభివృద్ధి లేక దీనావస్థకు చేరుకున్నాయి. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సర్పంచ్‌లు అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొంతమంది ఆత్మహత్య చేసుకున్నారు' అని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ నిరంకుశగా వ్యవహరించడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించాలని, ప్రొటోకాల్ పాటించాలని, సంక్షేమ పథకాల అమలులో సర్పంచ్‌లను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, తాడేపల్లిలో సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకటభానోజీ నాయుడు, కార్యదర్శి బి.అప్పలనాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొయ్యాన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి రుప్ప లక్ష్మీరమణమూర్తి, మూకళ్ల శ్రీను, పీస వెంకటరమణమూర్తి, గొండు వెంకటరమణమూర్తి, కంచు దశరథ, వాడాడ నాగేశ్వరరావు, ముద్దాడ గున్నయ్య, రెడ్డి శంకర్, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసీపీకి సమాధి కట్టాలి

- ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పార్లమెంట్‌కు వెళ్లగలడా?
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి: రానున్న ఎన్నికల్లో వైసీపీకి శాశ్వతంగా సమాధి కట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ తరపున పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసేందుకు సిద్ధపడుతున్న అభ్యర్థికి ఢిల్లీ సెంటర్‌లో వదిలితే కనీసం పార్లమెంట్‌కు చేరుకోగలడా అని ప్రశ్నించారు. మంగళవారం రావివలస ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్, హిందీ వంటి ప్రధాన భాషలు రాని వ్యక్తులు పార్లమెంట్‌లో ఏమి మాట్లాడగలరని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పది రూపాయల బటన్ నొక్కి వంద రూపాయలు బుక్కుతున్నాడన్నారు. ఐదేళ్లలో ఈ ప్రభుత్వం వంశధారాపై ఒక్క రూపాయి అయినా ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. రావివలసకు తాము అధికారంలోకి వచ్చిన తరువాత డబుల్‌రోడ్డు, సెంటర్ లైటింగ్‌తో తీర్చిదిద్దుతామన్నారు. ఎండలమల్లన్న ఆలయ అభివృద్ధి తన హయాంలో జరిగిందే తప్ప ఈ ఐదేళ్లలో ఏమి జరిగిందని ప్రశ్నించారు.

వైసీపీ నుంచి 50 కుటుంబాలు చేరిక

రావివలసలో 50 కుటుంబాలు వైసీపీని వీడి అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలోచేరాయి. అప్పిని ఢిల్లేశ్వరరావు, అట్టాడ రమణయ్య, కొర్రాయి వెంకటేష్, అంకుల విజయ్‌కుమార్, రాపల్లి నాగభూషన్, బులకల రాంబాబు, వెంకటేష్, డొంకాన ఢిల్లేశ్వర్, ప్రదీప్, రామచంద్రారెడ్డి, పందిరి లోకేష్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి అచ్చెన్నా యుడు ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ఎల్ నాయుడు, లమ్మత లక్ష్మి, బోయిన గోవిందరాజులు, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మట్ట పురుషోత్తం, దమయంతి, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కోళ్ల కామేసు, లవకుమార్, మామిడి రాము, కింగ్, బడే జగదీష్, నర్తు కృష్ణ, పశుపతి, హనుమంతు అప్పలరాజు, జగదీష్ పాల్గొన్నారు.

● **కోటబొమ్మాళి/సంతబొమ్మాళి:** కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడక్యాంపు కార్యాలయంలో టీడీపీరాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. సంతబొమ్మాళి మండలంలోని ఆకాశలక్కవరం పంచాయతీకి చెందిన సగ్గు రమేష్ ఆయన అనుచర కుటుంబాలు, టెక్కలి మండలంలోని సన్యాసిపేట నుంచి జెన్ని లచ్చయ్య, సింగువలస సింహాచలం, పున్నయ్య, జన్ని మనోజ్ కుమార్, మధు, దిలీప్, వెంకటేష్, దుర్గారావు, మధు తదితర 25 కుటుంబాలు చేరాయి. సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పంచాయతీ విషుచక్రం గ్రామానికి చెందిన జీరు బాబురావు, జీరు శ్యామలరావు, గిన్ని శ్రీను తదితరులు పార్టీలో చేరారు. కార్య క్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్ర సాద్, జీరు సుందరరావు, కోట నారంనాయుడు పాల్గొ న్నారు. అలాగే కోటబొమ్మాళి మండ లంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ హరిశ్చంద్రపు రం, వింజాంపాడు తదితర గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అచ్చెన్నాయుడు కలిసి సమస్యలు తెలియజేశారు కార్యక్రమంలో నాయకులు పూజారి శైలజ, ఉప్పాడ జయరాం పాల్గొన్నారు. అలాగే టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు కలిశారు.



టెక్కలి: రావివలసలో అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు



ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగిలో బాబుష్యూరిటీపత్రాలు అందజేస్తున్న నాయకులు



ఆమదాలవలస: కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు



కొత్తూరు: బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

జగన్‌ను ఇంటికి పంపించాలి



నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీలో టీడీపీ మేనిఫెస్టోను మహిళలకు వివరిస్తున్న బగ్గు రమణమూర్తి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

సీఎం జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ, పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

ఇచ్ఛాపురం/రూరల్/ఆమదాలవలస/ కొత్తూరు/ హరిపురం/ వజ్రపుకొత్తూరు/ నరసన్న పేట/ హిరమండలం: భవిష్యత్ తరాలు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు, మహా శక్తి పథకం ద్వారా 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500, అన్నదాతలకు ఏటా రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు యువగళం ద్వారా ఉద్యోగాల కల్పన, దీపం పథకం ద్వారా ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తారని వివరించారు. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి, ఇచ్ఛాపురం 11వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూపాన సూర్యనారాయణ, తిప్పన బాల, ఎన్.నూకయ్య, కౌన్సిలర్ ఆశి లీలారాణి పాల్గొన్నా రు. ఆమదాలవలస పట్టణంలోని 12వ వార్డులో టీడీపీ నాయ కుడు తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వేణుగోపాలరావు, బాలు పాల్గొన్నారు. కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ముగితి లక్ష్మణ, కర్నేన బుడ్డు, టొంపల తిరుపతి, హరిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, కోనారి తులసీరావు, కరగాన వాసు, నవీన్, శ్రీరాములు పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, రెయ్యిపాడు, కొండవూరు, రెయ్యిపాడు గ్రామాల్లో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, పోతనపల్లి సాంబమూర్తి, గోవిందు పాపారావు, గొరకల వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, రమణ పాల్గొన్నారు. నరసన్నపేట పట్టణం వీరన్నాయుడుకాలనీ, శివానగర్ కాలనీ తదితర వీధుల్లో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. శిమ్మ చంద్రశేఖర్ వెంకటేశ్వరరావు, గొద్దు చిట్టిబాబు, శిమ్మ జగన్నాథం, నర్సింహులు, తంగి తారేశ్వరరావు, బోయన ఆనంద్, తాళాభక్తుల గోవిందరావు, లక్కోజి రామక్రిష్ణ పాల్గొన్నారు. హిరమండలంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు ఆధ్యర్యంలో బాబుష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు.



పాతపట్నం: కాగువాడ వస్త్రపురికాలనీలో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు



ఇచ్ఛాపురం: బాబుష్యూరిటీపై అవగాహన కల్పిస్తున్న ఆశి లీలారాణి



హిరమండలం:బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిరహిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు



హరిపురం: సరియాపల్లిలో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో పల్లెపల్లెకు టీడీపీలో పాల్గొన్న నాయకులు

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: తామరాపల్లిలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో వచ్చే ఏడాది ఇంటర్‌లో ప్రవేశానికి ఫిబ్రవరి 23లోగా ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు మాత్రమే ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మార్చి పదో తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు తామరాపల్లి గురుకులం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అన్నక్యాంటీన్‌కు రూ.15 వేలు వితరణ

కోటబొమ్మాళి:కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఆదరణ పెరుగుతోందని పార్టీ నాయకులు కింజరాపు హరివర ప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ తెలిపారు. అన్న క్యాంటీన్ ప్రారంభించి 186 రోజులుగా రూ.ఐదుకే చక్కనైన భోజనంతో పేదవాడి ఆకలి తీరుస్తున్నట్లు చెప్పారు. కాగా అన్నక్యాంటీన్ ద్వారా భోజనాలు అందించేందుకు విజయవాడకు చెందిన చెరుకూరు జగదీష్ 15వేలు నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశారు.

ఆదాయ పన్ను వివరాలను సమర్పించాలి

నరసన్నపేట:ఉపాధ్యాయులు ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయపన్ను సంబంధించిన ఫారం-16తో పాటు పూర్తి వివరాలను ఫిబ్రవరి 15లోగా ఎమ్మార్సీకి అందజేయాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ మేరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆదాయపన్ను వివరాలను సేకరించేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సకాలంలో అందిస్తే ఫిబ్రవరికి సంబంధించిన జీతాలను సకాలంలో విడుదల అవుతాయని తెలిపారు.సకాలంలో ఉపాధ్యాయులు స్పందించిన ఫారం-16తోపాటు పూర్తి వివరాలకు సంబందించిన నాలుగు సెట్లను సమర్పించాలని సూచించారు.

జీవామృతం తయారీపై అవగాహన పెంచుకోవాలి

పలాసరూరల్:జీవామృతంతయారీపై అవగాహన పెంచుకోవాలి ప్రకృతి వ్యవసాయ యూనిట్ రీజినల్ ట్రైనింగ్ అధికారి హేమసుందర్ తెలిపారు. మంగళవారం టెక్కలిపట్నం,మోదుగులపుట్టి, బంజిరుపేటల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంలో వాడుతున్న విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ నాగరాజు, సనత్‌కుమార్, నారాయణరావు, కె.పాపారావు, రైతులు మద్దిల అప్పలస్వామి, మల్లేశ్వరరావు, వీరాస్వామి, షణ్ముఖరావు, జనని పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యానికి మేలు

నందిగాం: ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని తహసీల్దార్ వైవీ పద్మావతి తెలిపారు. నందిగాం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి లోకేష్ ఆధ్వర్యంలో కూరగాయల ప్రదర్శన నిర్వహించారు.ఈప్రదర్శనను తహసీల్దార్‌తో పాటు డీటీ ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్ఐ బి.కిరణ్, సీనియర్ సహాయకులు ఇ.సింహాచలం పరిశీలించారు. శివరాంపురానికి చెందిన బెండి గోవింద్ పొలంలో సాగుచేసిన పంటలను ప్రదర్శించి విక్రయించారు.

26 మద్యం సీసాలు స్వాధీనం

పాతపట్నం: స్థానిక రైల్వేగేట్ వద్ద మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒడిశా మద్యం తరలిస్తుండగా టెక్కలికి చెందిన ఇద్దరు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి రూ.3,420 విలువచేసే 26 ఒడిశా మద్యం సీసాలు,ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు

జలుమూరు, (సారవకోట): ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సారవ కోట మండలంలోని సవరడ్డపనస టీడీపీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు భవిష్యత్తు ప్రణాళికకు సంబందించిన అంశాలను ఇంటింటికి గ్రామస్థాయి కార్యకర్తలు తీసుకువెళ్లాలన్నారు. జాబితాలు నిశితంగా పరిశీలించి అర్హులైన ఓటర్లు జాబితాలో ఉండేలా పనిచేయాలని, తప్పుడు ఓట్లు ఉంటే గుర్తించి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ శిక్షకులు కత్తిరి వెంకటరమణ, ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు, జలుమూరు మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, డి.జయరాం, తాడేల భీమారావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, తర్ర బలరాం, గుండ రామకృష్ణ, జి.బాలకృష్ణ, క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

270 మందికి వైద్య పరీక్షలు

పలాస రూరల్: మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమంలో 270 మందికి వైద్యపరీక్షలు చేపట్టారు. ఈ కార్య క్రమంలో వైద్యులు హరీష్, ప్రమీల,వెంకటరమణ, దుర్గాప్రసాద్, దేవీ పరీక్షలు చేపట్టగా, పీహెచ్ఎన్ కల్యాణి, హెచ్‌వీ, అనురాధ, ఇందుమతి, కె.జయంతి పాల్గొన్నారు.

త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు

నరసన్నపేట: పట్టణంలోని శారద సంగీతాలయం ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాజుస్వామి 177వ ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని చిత్రపటంతో పట్టణ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధర్నా విజయవంతం చేయండి

మందస: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి గురువారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్‌కుమార్,కె.సుందరరావు కోరారు. మంగళవారం మందస పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు జి.భీమారావు, గణేశ్వరరావు, ఎస్.ఢిల్లీరావు, సుశాంత్ కుమార్‌రౌళో, డి.వైకుంఠరావు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: రైతులు సకాలంలో రుణాలను రెన్యూవల్ చేసుకుంటేనే ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు పొందేందుకు అవకాశ ముంటుందని, లేకపోతే పూర్తిస్థాయి వడ్డీతో రుణాలు చెల్లించాల్సి ఉంటుందని లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కె.కృష్ణారావు తెలిపారు. మంగళవారం లక్ష్మీనర్సుపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 25లోగా ఏడు శాతం వడ్డీచెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని, ఆ గడువు తేదీ దాటిన తర్వాత 13 శాతం వడ్డీతో రుణం తీర్చాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ సీఈవో సింహాచలం, సిబ్బంది పి.వెంకటరమణ పాల్గొన్నారు.

చైర్మన్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా..?

- వైద్యాధికారులపై బళ్ల గిరిబాబు ఆగ్రహం

పలాస: స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం అదనపు గదుల ప్రారంభోత్సవంలో వైద్యాధికారులు ప్రోటాకాల్ పాటించకపోవడంపై పలాస- కాశీబుగ్గ మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. శిలాఫలకంపై మునిసిపాలిటీలో ప్రథమ పౌరుడిగా తొలి వరుసలో చైర్మన్ పేరు ఉండాలి. అయితే అతిథుల వరుసలో ఆయన పేరు చేర్చడంపై ఆసుపత్రి వైద్యాధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చైర్మన్‌కు ఆసుపత్రిలో ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ విషయంపై మంత్రి అప్పలరాజు జోక్యంచేసుకుని ఆయన్ను శాంతిపజేసినా ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు. మరోసారి ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని ఆయనకు నచ్చజెప్పడంతో శాంతించారు. కాగా సీహెచ్‌సీలో రూ.5.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వాసుపత్రి అదనపు వార్డులను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. ● **పలాస రూరల్:** పలాస పీఏసీఎస్ భవనాన్ని మంత్రి అప్పలరాజు ప్రారంభించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పైల వెంకటరమణ, డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు, ఎంపీపీ ఉంగ ప్రవీణ, జడ్పీటీసీ ఎం.రత్నాలు, ఎంపీడీవో రమేష్‌నా యుడు, తహసీల్దార్ మధుసూదనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలగలను బీసీ జాబితాలో చేర్చాలి

హరిపురం: తెలగ కులస్థులను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ శాఖ అధ్యక్షుడు పల్లంట్ల వెంకటరామారావు కోరారు. మంగళవారం హరిపురంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ హక్కుల సాధనకు మద్దతు తెలియజేసే పార్టీలకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలగసంఘ అధ్యక్షుడు ఇనుముల జనార్దన, త్రిపురాన రాజేంద్రదాస్, భైరిశెట్టి గున్నయ్య శ్రీనివాసరావు, పుల్లావాసు, బల్ల లీలారాణి, మట్ట ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడిటోరియం ప్రారంభం



టెక్కలిలో లైబరీని ప్రారంభిస్తున్న కలెక్టర్‌తో పాటు ఐఏఎస్ అధికారులు

టెక్కలి: టెక్కలి సబ్‌కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ యంత్రాంగం నిర్మించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ఆడిటోరియం కమ్ లైబ్రరీని మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్, జేసీ ఎం.నవీన్‌కుమార్, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్కలిలోని హుద్‌హుద్ ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు జీవీ రెడ్డి కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. టెక్కలిలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీఐ డి.సంజీవరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 83 మంది ఎంపిక

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ కెరియర్ గైడెన్స్ సెల్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, విశాఖ మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 83మంది అభ్యర్థులు అర్హత ఆధారంగా వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, జేకేసీ కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి, నిర్మాణ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీధర్, అధ్యాపకులు జి.కసవయ్య, శాంతన్‌కుమార్, గిరీష్, తిరుమల, సీహెచ్.భవానీ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్‌కు మంగళవారం అన్ని శాఖల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమా మల్లేశ్వరరావు, ఎంఈవోలు ఎస్.అప్పలరాజు, ఎల్‌వీ ప్రతాప్, గృహనిర్మాణశాఖ ఏఈ రెడ్డి పాపినాయుడు, హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేరాడ వెంకటరావు, కవిటి రామరాజు, బమ్మిడి గణపతిరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఏఎంవో

మెళియాపుట్టి: ఇంటర్, పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఎస్ఏ ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మెళియాపుట్టిలోని కేజీబీవీని తనిఖీచేశారు. విద్యార్థినులకు సబ్జెక్టులపై ఏ మేరకు అవగాహన ఉందో అడిగితెలుసుకున్నారు. సమావేశంలో ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మనాభం, ప్రిన్సిపాల్ రమ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయండి: ఆర్డీవో



అధికారులతో మాట్లాడుతున్న భరత్‌నాయక్

వజ్రపుకొత్తూరు: పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్ కోరారు. మంగళవారం మండలంలో మహదేవపురం, బట్టుపాడు, ఉద్దానం రామకృష్ణాపురం, గోవిందపురం, దేవునల్తాడ. పాతటెక్కలి, రెయ్యిపాడు, తేరపల్లి, కొండవూరు. పెద్దబొడ్డపాడు, బెండి, నగరంపల్లి, పెదబడాం పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లోని మరుగుదొడ్లు, గదులు, ఇతరసదుపాయాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పాతటెక్కలిలో ఉన్న ల్యాండ్ కన్వర్షన్ పరిశీలించారు. పెద్దమురహరిపురంలో వైద్యశిబిరం పరిశీలించారు.కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి పాల్గొన్నారు.

లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి

పాతపట్నం:మండలంలో లేఅవుట్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని సుడా ప్లానింగ్ అధికారి పి.మోహన్ తెలిపారు. మంగళవారం మండలంలో పలు లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు.సుడా అనుమతిలేని లేఅవుట్లల్లో స్థలాలు కొనుగోలుచేస్తే నిర్మాణ అనుమతులు ఇవ్వబోమని చెప్పారు. సమావేశంలో పాతపట్నం ఈవో కూర్మారావు, సుడా సిబ్బంది సలీం మోహన్ పాల్గొన్నారు



ఎచ్చెర్ల: బీఆర్‌ఏయూలో నివాళులర్పిస్తున్న వీసీ రజని తదితరులు



ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో..



అరసవల్లి: శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో..



అరసవల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



నరసన్నపేట: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..

గాంధీజీ జీవితం ఆదర్శనీయం

ఎచ్చెర్ల: అహింస, సత్య వాక్కులను ఆయుధాలు చేసుకుని స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ జీవితం ఎప్పటికీ ఆదర్శమేనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో మంగళవారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, రాజశేఖరరావు, సీడీసీ డీన్ సుజాత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు. అలాగే ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన గాంధీజీ వర్ధంతిలో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఓఎస్డీ, ఏవో రామకృష్ణ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.



ఇచ్ఛాపురం రూరల్: ఈనేసుపేట పాఠశాలలో..



నందిగాం: పెద్దతామరాపల్లిలో గాంధీ వేషధారణలో..



ఆమదాలవలస పట్టణంలో కాంగ్రెస్ నేతలు..



సరుబుజ్జిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



టెక్కలి: ఐతం కళాశాలలో..



పాతపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



కవిటి: గొర్లపాగు పాఠశాలలో..



హిరమండలం: కస్తూర్బా విద్యాలయంలో..



సారవకోట గ్రంథాలయంలో..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11కేవీ ఫీడర్ మరమ్మతుల పనులు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 11కేవీ ఫీడర్ పరిధిలో గల గొల్లవీధి, వీకేపేట, రత్తకన్నలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బడ్జెట్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం బడ్జెట్‌తో పాటు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని తెలిపారు. అధికారులు, కౌన్సిల్ సభ్యులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

3న సర్వసభ్య సమావేశం

రణస్థలం: మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 3వ తేదీ 11 గంటలకు మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన జరగనున్నదని ఎంపీడీవో రమనమూర్తి తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రణస్థలం: అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, ఎంపీపీ పిన్నింటి రజిని, మానస చిరంజీవి పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైం: బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేసినా, స్కూల్స్ కళాశాలల దగ్గర పొగాకు ఉత్పత్తులు విక్రయాలు చేసినా కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీలు జె.తిప్పేస్వామి, విఠలేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పొగాకు నియంత్రణ సంస్థ (ఎన్‌టీసీపీ), రాష్ట్ర ప్రజారోగ్య సంబంధ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన శిక్షణలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ అనురాధ, డీఎస్పీలు వై.శృతి, ఎస్.వాసుదేవ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు ప్రపంచానికే ఆదర్శం



మాట్లాడుతున్న చిన్నజీయర్ స్వామి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరాముడు ప్రపంచానికే ఆదర్శప్రాయుడని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం డీసీసీబీ కాలనీలో గల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రవచనాలు చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రపంచానికే ఆనందకరమైన విషయమన్నారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండాలన్నారు. స్వామి వారిని పలువురు కలుసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

శ్రీకాకుళం క్రైం: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని సంతోషిమాత ఆలయం వద్ద ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ అంతం మొదలైంది

పొందూరు: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అంతం మొదలైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. కృష్ణాపురం గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు సర్పంచ్ అంబళ్ల శ్రీనివాసరావు కుమార్తె కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియంతృత్వాన్ని భరించలేక వైసీపీ నాయకులు ఆ పార్టీనుంచి వీడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నైజాన్ని, బండారాన్ని అతని సోదరి వైఎస్ షర్మిల, చిన్నాన్న కుమార్తె సునీతారెడ్డే బయటపెడుతున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు గాడు నారాయణరావు, చింతాడ కృష్ణవాసుదేవరావు, వండాన మురళి, బాడాన గిరి, వీఆర్ఎల్ నాయుడు, వరదరాజులు తదితరులు ఉన్నారు.

పాలపోలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

సంతబొమ్మాళి: బోరుభద్రలో గ్రామదేవత పాలపోలమ్మతల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీరగా పూజారులు ప్రియా భాగెన్నాయుడు, రామచంద్రరావు పసుపు కుంకుమలు, ముర్రాటలు సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వజ్జ ప్రభాకర్,అప్పిని వెంకటేష్,ముద్దపు ఆనందరావు,జల్లు కార్తీక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

సరుబుజ్జిలి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో రొట్టవలస హైస్కూల్, ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఖోఖో పోటీల్లో తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు పాఠశాల హెచ్ఎం కె.రామకృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది చేతుల మీదుగా బహుమతులు అందించారు. పీడీ అప్పయ్యను అభినందించారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు

సరుబుజ్జిలి: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు జంతు సంక్షేమంపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్ఎం ఉమ, ఉపాధ్యాయులు రత్నకుమారి, వార్డెన్ పూర్ణ, కళావతి, రజని, విజయలక్ష్మి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగరాజు వర్ధంతి

కవిటి: సంగీత జగద్గురు త్యాగరాజుస్వామి వర్ధంతి ఆరాధన మహోత్సవం సీమూరు గ్రామంలో సంగీత కళాకారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఉద్దానంలోని సంగీత కళాకారులు పాల్గొని గురువుగారికి స్వరాభిషేకం నిర్వహించారు. ఉదయం గ్రామంలో త్యాగరాజు చిత్రపటంతో తిరువీధి, త్యాగరాజ కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా సుదర్శన యాగం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలో మంగళవారం సుదర్శన యాగం ఘనంగా ప్రారంభమైనది. ఉదయం బాహుదానది జలాలను కలశాలతో తెచ్చి ఇంటి ముందు కుంబాలు పెట్టి ఆ జాలాలతో యజ్ఞశాలను శుద్ధి చేసి వేద పండితులు యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమాధి కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

దీక్ష విజయవంతం చేయాలి

సోంపేట: పాత పెన్షన్ విధానం కోసం ఓట్‌ఫర్ ఓపీఎస్ నినాదంతో ఫిబ్రవరి 4న విశాఖలో నిర్వహించనున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ఓపీసీపీఎస్ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం పట్టణంలో విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తలగాణ చంద్రశేఖర్, దాలిబందు తదితరులు పాల్గొన్నారు.

నాట్య శ్రీలతకు అభినందన



ఆమదాలవలస: దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చిన ఆమదాలవలసకు చెందిన కూన శ్రీలతను మంగళవారం పట్టణానికి చెందిన వివిధ ధార్మిక సేవా సంస్థలు అభినందించారు. జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో ఆమదాలవలస నృత్య కళాకారిణికి దక్కిన అరుదైన అవకాశమని, ఇది మన జిల్లాకే గర్వకారణమని అభిప్రాయపడ్డారు. సేవాభారతి, విజయనగర్ విభాగ్ ప్రముఖ్ కనుగుల సత్యం, ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర కార్యదర్శి సనపల నర్సింగరావు, సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త దన్నాన లక్ష్మి, ధర్మ రక్షా పరిషత్ సభ్యులు డి.రవికుమార్, ఎం.రామకృష్ణారావు శ్రీలత తల్లిదండ్రులు విజయనిర్మల, షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్‌రెడ్డికి చెంపపెట్టు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి చెంపపెట్టు అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం బారువ గ్రామంలో పలువురు తెలుగు దేశం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార గర్వంతో తప్పుడు కేసులతో చంద్రబాబును ఇబ్బందిపెట్టాలని చూస్తున్నా కోర్టులు తప్పుడు కేసులుగా కొట్టివేస్తోందన్నారు. బారువ గ్రామానికి చెందిన మహేష్ మాస్టార్, దున్న సత్యం, కర్రి కామేష్, నర్సింహమూర్తి తదితర వైసీపీకి చెందిన 40 కుటుంబాల టీడీపీలో చేరాయి. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, మద్దు కుమార్, రాజేష్ ఖన్నా, పీఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సభకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం: వచ్చే నెల 5న సురంగిరాజా మైదానంలో జర గనున్న నారా లోకేశ్ శంఖారావం సభకు టీడీపీ నాయకులు స్థల పరిశీలిన చేశారు. మంగళవారం సభా ఏర్పాట్లను రాబిన్‌సింగ్ బృందం జిల్లా పరిశీలికులతోపాటు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పరిశీలించారు. ఇప్పటికే సభ నిర్వహణకు సంబం ధించి పోలీసు ఉన్నతాధికారులతోపాటు స్థానిక సీఐ అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నందికి జాని, వార్డు కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి, సీనియర్ నాయకులు రెయ్యి జానకిరావు, బి.కృష్ణయ్య, శివ, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వోన్నత న్యాయస్థానం తీర్పు గుణపాఠం కావాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి: ఇన్నర్ రింగురోడ్డు కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం జగన్ ప్రభుత్వానికి గుణపాఠం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడు కేసులని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గు పడాలని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయొద్దని హితవు పలికారు. తప్పుడు కేసులతో చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూశారని, కానీ ఈ తప్పుడు కేసుల ఫలితంగా ప్రజలు చంద్రబాబుకు మరింత మద్దతు పలికారని, చంద్రబాబు సభలకు హాజరైన జన సమూహాలను చూస్తే ఈ విషయం అందరికీ అర్థమవుతుందన్నారు. జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. తీవ్ర వ్యతిరేకతతో అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు జగన్‌రెడ్డి అహంకారాన్ని భరించలేక పార్టీని వీడి పోతున్నారని, ఇప్పుడు వైనాట్ 175 నుంచి సంతోషంగా దిగిపోతానని జగన్ అనడం దిగజారిన పరిస్థితికి అద్దం పడుతుందన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



లక్ష్మీనరసింహాన్ని సన్మానిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, పార్టీ బలోపేతం చేయాలని విజయనగరం లోక్‌సభ కన్వీనర్ సంబర లక్ష్మీనరసింహం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావును ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎన్ఈఆర్ సన్మానించారు. పార్టీ నాయకులు బొబ్బిలి శ్రీను, మన్నె సురేష్, టొంపల అప్పలరాజు, కృష్ణానందం పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. మంగళవారం అరసవల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విజన్ గల నాయకుడు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఇప్పటి వైసీపీ పాలనతో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టిపోయాయన్నారు. ప్రజలను రక్షించే ప్రభుత్వం కావాలని, అది టీడీపీతోనే సాధ్యమన్నారు.

రానున్నది జనసేన-టీడీపీ ప్రభుత్వం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం: రానున్నది జనసేన-టీడీపీ ప్రభుత్వమని, జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గం ఆ పార్టీ సమన్వయకర్త విశ్వక్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జనసేన పార్టీ గుర్తు గ్లాస్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి టీ పంపిణీ చేస్తూ గ్లాస్ గుర్తుపై వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బసవ గోవిందరెడ్డి, వడ్డాది శ్రీనివాసరావు, బాలి అన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తానా ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఎచ్చెర్ల: ముద్దాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రశంసా పత్రాలను అందజేసింది. గతేడాది డిసెంబరు 18న 10 లక్షల మంది విద్యార్థులతో అమ్మానాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో తానా నిర్వహించింది. ఇందులో భాగస్వామ్యమైన ముద్దాడ పాఠశాల విద్యార్థులకు తానా ప్రశంసా పత్రాలను అందజేసినట్టు పాఠశాల హెచ్ఎం మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు ఈ మేరకు ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందించారు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా రాధాకృష్ణ

ఎచ్చెర్ల: ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాట్లింగ్ యూనిట్ మేనేజర్ (డీఎం)గా ఎం.రాధాకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలులో అసిస్టెంట్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణను ఈఎస్‌గా పదోన్నతి కల్పిస్తూ... ఇక్కడి యూనిట్‌కు డీఎంగా నియమించారు. ఇప్పటివరకు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సుబ్బారావు డీఎంగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పొందూరు: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత అవరమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం చెత్తబుట్టలు పంపిణీలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు.

పాఠశాలలో 'ఆసరా'పై మండిపాటు



చెక్కుల పంపిణీలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆసరా చెక్కుల పంపిణీపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పక్కనే మైదానం ఉన్నా తరగతులు జరుగుతున్న ప్రాంగణంలో సభ నిర్వహించడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడ్డారని మండిపడ్డారు. పాఠశాలకు సెలవు రోజున ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే బాగుండేదని, కాని విద్యార్థులకు ఇబ్బందికలిగేలా నిర్వహించడం ఏంటని అధికారులను, ప్రజా ప్రతినిధులును పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

కలెక్టరేట్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులంతా వినియోగించుకోవాలని జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్ పిలుపునిచ్చారు. ఈ పథకంపై మంగళవారం స్థానిక డీఆర్డీఏ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తి పనులు చేసుకుంటున్న వారిని ప్రోత్సహించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం అన్నారు. సమావేశంలో ఎల్డీఎం సూర్యకిరణ్, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డీపీవో రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, ఎంఎస్ఎంఈ ఏడీ డీవీఎస్ఆర్ మూర్తి, నాగకుమార్, పరిశ్రమల శాఖ ఏడీ రఘునాథ్, డీపీఆర్వో బాలమాన్‌సింగ్ పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి

జి.సిగడాం: రీసర్వేను పక్కాగా చూపట్టాలని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు అన్నారు. సంతవురిటి సచివాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వెంకటరావు, సీహెచ్ఆర్‌కే రంగారావు, బి.సన్యాసిరావు, రీ సర్వే డీటీ గాయత్రి, వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ లఠ్కర్‌కు సన్మానం



సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో

కలెక్టరేట్: బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి తదితరులు కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

జలుమూరు: విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవరచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రగడ దుర్గారావు తెలిపారు. మంగళవారం జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.